
సాక్షి
బాపట్ల

శుక్రవారం । 27 । జూన్ । 2025



ప్రత్యేక పూజలు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న కోదండ రామస్వామి ఆలయంలో గురువారం ఏపీ పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ జి.బ్రహ్మయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.

వారాహి అలంకరణలో బగళాముఖి



చందోలు(కర్లపాలెం): వారాహి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారికి వారాహి అమ్మవారి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూలు, పండ్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

పవర్ లిఫ్టర్ సాదియాకు బంగారు పతకం



మంగళగిరి: ఈ నెల 22వ తేదీ నుంచి కర్ణాటకలో జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సాదియా అల్మాస్ బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు , షేక్ సంధానిలు గురువారం తెలిపారు. 57 కేజీల స్క్వాడ్ విభాగంలో 200.5 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 185.5 కేజీలు బరువులు ఎత్తి అల్మాస్ రికార్డు సృష్టించారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అల్మాస్‌ను పలువురు అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు వెల్లడించారు.

మొహరం వేడుకలు ప్రారంభం



పొన్నూరు: మొహరం పండుగ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. హజరత్ మొహమ్మద్ వారి మనుమలు హజరత్ ఇమామే హసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరిస్తూ పట్టణంలోని మొల్లా దహెరా మసీదు వద్ద పీర్ల చావిడిలో పీర్లను పూలతో అలంకరించారు. మేళ వాయిద్యాలతో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని, మొల్లా నజీర్, మొల్లా ఖలీల్ బాషా, మొల్లా జలీల్, మొల్లా బాజి, మొల్లా నసీర్, మొల్లా రహంతుల్లా, షేక్ గౌస్, మొల్లా అసద్, మొల్లా అర్షద్, మొల్లా ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు. మొల్లా కరీమ్ పర్యవేక్షించారు. జూలై 4వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీడీఏగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు (డీడీఏ)గా ఎ.నాగేశ్వరరావు గురువారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావు వైఎస్సార్ కడప జిల్లాలో డీడీఏగా పనిచేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు(జేడీఏ)గా పనిచేస్తున్న యు.నరసింహారావు ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. నరసింహారావు రిటైర్ అయ్యాక ఎ.నాగేశ్వరరావు ఆయన స్థానంలో కొనసాగనున్నారు.

సత్య సాయిబాబా ప్రచార రథానికి స్వాగతం



తెనాలి: పుట్టపర్తిలోని శ్రీ సత్య సాయిబాబా ఆశ్రమ ప్రస్థానం 75 ఏళ్లకు చేరుకుంటున్న సందర్భంగా ప్రత్యేక ప్రచార రథం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తోంది. శ్రీసత్య సాయిబాబా బోధనలను ప్రచారం చేస్తోంది. ఆ క్రమంలో బుధవారం రాత్రి తెనాలి వచ్చిన ప్రచార రథానికి ఘనస్వాగతం లభించింది. భక్తులు పలువురు హారతులిచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. విశ్రాంత పోలీసు అధికారి విఠలేశ్వర్, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న హంపి పీఠాధిపతి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో బృందావన శ్రీనివాసుడిని గురువారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి సభ్యులను, భక్తులను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు, ఆలయ అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పచ్చనేతల కప్పం పెరిగింది

- కూటమి పాలన ప్రారంభంలో నెలకు రూ.12 లక్షలు
- ఇప్పటివరకు నెలకు రూ.25 లక్షలు
- ప్రస్తుతం నెలకు రూ.30 లక్షలు చెల్లించాలని పచ్చనేతల డిమాండ్
- దందా నిర్వాహకులకు పచ్చ నేతల అల్టిమేటం
- నరేనన్న రేషన్ దందా నిర్వాహకులు
- పర్చూరులో ఈనెల నుంచే అమలు
- మిగిలిన చోట్ల వచ్చే నెల నుంచి చెల్లింపులు

బాపట్ల జిల్లాలో యథేచ్ఛగా రేషన్ దందా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: పేదల చౌక బియ్యం పచ్చనేతలకు కాసులు కురిపిస్తోంది. నిరుపేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని వారి కడుపుకొట్టి రేషన్ దందాకు అప్పగిస్తే సరి అందుకు ప్రతిఫలంగా నెలనెలా లక్షల్లో కప్పం చెల్లించేందుకు దందా నిర్వాహకులు రాబందుల్లా కాచుకు కూర్చున్నారు. ఇంకేముంది డబ్బులొస్తే ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉన్న పచ్చనేతలు అందుకు సై అన్నారు. నెలనెలా రేషన్ దందానుంచి రూ.25 లక్షలు కప్పం కట్టించుకుంటున్నారు. ఇది చాలదన్నట్లు ఆ మొత్తాన్ని వచ్చేనెల నుంచి రూ.30 లక్షలకు పెంచాలని అల్టిమేటం జారీ చేశారు. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ రేషన్ దందా పచ్చనేతలు చెప్పిన మొత్తం చెల్లించేందుకు సిద్ధమయ్యారు. చౌక బియ్యాన్ని పేదలకు అందేలా చూడాల్సిన ప్రభుత్వ అధికారులు మామూళ్లు తీసుకుని బియ్యం అక్రమ రవాణాకు అండగా నిలుస్తున్నారు.

రూ.30 లక్షలు చెల్లిస్తేనే దందా

ఇకనుంచి నెలకు రూ.30 లక్షలు కప్పం కడితేనే చౌక బియ్యం ఇస్తామని జిల్లాకు చెందిన పచ్చనేతలు రేషన్ దందా నిర్వాహకులకు స్పష్టం చేశారు. తమకూ ఖర్చులు పెరిగాయని ఆ మేరకు చెల్లించిన వారికే నియోజకవర్గంలో బియ్యం వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇస్తామని వారు తెగేసి చెప్పారు. దీంతో నియోజకవర్గం పచ్చనేతలకు నెలకు రూ.30 లక్షలు చెల్లించేందకు రేషన్ దందా సై అంది. ఇంత మొత్తంలో కప్పం చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందా? అని తొలుత కొందరు వ్యాపారులు లెక్కలు వేసుకోగా మరి కొందరు వ్యాపారులు పచ్చనేతలు అడిగిన మేరకు రూ.30 లక్షలు చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. దీంతో మిగిలిన వ్యాపారులు సైతం అదే బాటలో నడవాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లుగా బియ్యం వ్యాపారం చేసి ఇప్పుడు మానేసి వేరే వ్యాపారం చేయలేమని కొందరు వ్యాపారులు ఇందుకు సిద్ధపడినట్లు సమాచారం. వాస్తవానికి నియోజకవర్గ పచ్చనేతలకు నెలకు రూ.30 లక్షలే కాకుండా పౌరసరఫరాల శాఖకు చెందిన అధికారికి నెలకు రూ.రెండు లక్షలు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు స్థానిక సివిల్ సీఐ, ఎస్‌ఐలకు నెలకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.10 వేల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక్కొక్క నియోజకవర్గంలో నెలకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా మామూళ్లు ముట్టజెప్పాల్సి వస్తోందని రేషన్ దందా నిర్వాహకులు వాపోతున్నారు. ఈ లెక్కన నియోజకవర్గ పచ్చనేతలకు నెలకు రూ. 30 లక్షలు అనుకుంటే నెలకు మొత్తం రూ.35 లక్షలు ఖర్చు వస్తోంది. అయినా చాలామంది వ్యాపారులు పచ్చనేతలకు నెలకు రూ.30 లక్షల చెల్లించేందుకు సిద్ధపడుతున్నారంటే రేషన్ బియ్యం వ్యాపారం ఎంత లాభాలు ఆర్జించి పెడుతుందో అర్థమవుతుంది.

రూ.25కు కొనుగోలు..రూ.80కి అమ్మకం

ఇక్కడ అన్ని ఖర్చులతో కలిపి కిలో రూ.25 లోపే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు కిలో రూ.70 నుంచి 80కి తగ్గకుండా విక్రయిస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి రోజుల్లో నియోజకవర్గ పచ్చనేతకు నెలకు రూ.12 లక్షలు కప్పం చెల్లించగా మొదటి మూడు నెలల్లోనే ఆ మొత్తాన్ని ఏకంగా రూ.25 లక్షలకు పెంచారు. ఇప్పుడు రూ.30 లక్షలకు పెంచారు. వచ్చే నెలనుంచి ఈ మొత్తాన్ని చెల్లించేందుకు పచ్చనేతలతో రేషన్ దందా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. పచ్చనేతలు సంపాదనే ధ్యేయంగా పేదల కడుపు కొడుతుండడంపై స్థానికంగా నిరసన వ్యక్తమవుతుంది. రేషన్ దందా నిర్వాహకులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నియోజకవర్గాలలో దందా ఇలా...

- మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత నియోజకవర్గం రేపల్లెలో నిజాంపట్నం మండలానికి చెందిన వ్యక్తిని నియమించుకొని మంత్రి సమీప బంధువు రేషన్ దందా నడిపిస్తున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి 20 శాతం చౌక బియ్యం కృష్ణా జిల్లాకు తరలిపోతుండగా మిగిలిన 80 శాతం బియ్యాన్ని ఒంగోలుకు చెందిన వ్యాపారులు తరలించుకు వెళుతున్నారు.
- మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు చెందిన అద్దంకి నియోజకవర్గంలో రాముడు అనే రేషన్ డీలర్ చౌక బియ్యం వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు సమాచారం. ఇందులో మంత్రి అనుచరులకు వాటాలు ఉన్నట్లు సమాచారం.
- వేమూరు నియోజకవర్గంలో చుండూరు మండలానికి చెందిన కోటిరెడ్డి మండలానికి ఒకరిని చొప్పున నియమించుకొని బియ్యం వ్యాపారాన్ని సాగిస్తూ మొత్తం బియ్యాన్ని గుజరాత్‌కు తరలిస్తున్నారు. ఈయన నియోజకవర్గ నేతలకు ఇప్పటి వరకూ రూ.25 లక్షలు ముట్టజెపుతున్నారు.
- బాపట్ల నియోజకవర్గంలో బాపట్ల అర్బన్, రూరల్ పరిధిలోని ముగ్గురు రైస్ మిల్లర్లు బియ్యం వ్యాపారం సాగిస్తూ పచ్చనేతకు నెలకు రూ.25 లక్షలు చెల్లిస్తున్నారు.
- చీరాల నియోజకవర్గంలో పచ్చనేతకు ఇప్పటివరకూ నెలకు రూ.25 లక్షలు చెల్లించి ఒంగోలుకు చెందిన వ్యాపారులు బియ్యం తరలిస్తున్నారు.
- పర్చూరు నియోజకవర్గంలో స్థానిక నేతలు బియ్యం వ్యాపారం సాగించి పచ్చనేతకు నెలకు రూ.30 లక్షలు చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తరింపజేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ఆర్డీఓ గ్లోరియాను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ సేవలను విస్తరింప చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు వెల కట్టలేనివని అన్నారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదుతో రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గవర్నర్ చేతుల మీదుగా 'రెడ్‌క్రాస్ బెస్ట్ అవార్డు' అందుకోవటం గర్వంగా ఉందన్నారు. కృష్ణానది వరదల సమయంలో వరద బాధితులకు రెడ్‌క్రాస్ బృందం అందించిన సేవలు కొనియాడారు. విపత్తులు, అత్యవసర సమయాల్లో రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా రెడ్‌క్రాస్ సేవలను కొనసాగించాలని అన్నారు.

ప్రజల ఆరోగ్యం, సంరక్షణలో రెడ్‌క్రాస్ ముందు ఉంటుందని అన్నారు. సభ్యత్వ నమోదులో ముఖ్య పాత్ర పోషించిన అధికారులకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అవార్డులు ప్రదానం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షుడు నారాయణ భట్టు అధికారులు పాల్గొన్నారు.

కస్పా నిధులు కైంకర్యం



చెరువుకట్టపై వేసిన పశువుల ఎరువు దిబ్బలు

- కర్పూరంలా కరిగిపోతున్న కస్పా మాన్యం నిధులు
- చెరువు అభివృద్ధి చేయకుండానే రూ.60 లక్షలు స్వాహా
- సంబంధిత కార్యాలయాల్లో ఏళ్ల నాటి రికార్డులు మాయం
- పూనూరు గ్రూపు దేవస్థానం మాన్యం భూముల్లో అవినీతి

యద్దనపూడి: దొంగలు.. దొంగలు కలసి ఊళ్లు పంచుకోవటం అంటే ఇదేనేమో. ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో నమోదు చేస్తూ లక్షలాది రూపాయల దేవస్థానం భూముల ఆదాయాన్ని ఆ శాఖాధికారులు నొక్కేస్తున్నారు. కానీ ఎన్నో ఏళ్లగా గ్రామస్తులు చెరువుని అభివృద్ధి చేయండి మహాప్రభో అంటూ మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా గతంలో ఎంతో అందంగా.. స్వచ్ఛమైన నీరు ఉండే చెరువు నేడు మురుగు, దుర్వాసనతో తాగునీటికే కాదు..వాడుకకి కూడా పనికి రాని దుస్థితికి చేరింది.

రికార్డులు మాయం

యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలోని కస్పా చెరువు 40 ఎకరాల విస్తీర్ణంలో రెండు భాగాలుగా విస్తరించి ఉంటుంది. గ్రామంలోని 6,700 మందికి ఈ చెరువు నీరే ఆధారం. ఈ చెరువు దేవదాయ శాఖ ఆధీనంలో ఉంది. కాగా చెరువు మరమ్మతుల కోసం పూర్వం దాతలు ఇచ్చిన మాన్యం భూములు 20 ఎకరాలున్నాయి. ఈ 20 ఎకరాలపై సంవత్సరానికి రూ.4.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. 15ఏళ్లగా భూముల ఆదాయ, వ్యయాలకు సంబంధించి అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పదేళ్ల క్రితం రికార్డులు సైతం మాయమవటం ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. ఆ తరువాత నుంచి రికార్డులు అధికారుల దగ్గర ఉన్నప్పటికీ జమా, ఖర్చుల గురించి గ్రామస్తులు ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడంలేదు. వేలంలో చెరువు మాన్యం భూములు కౌలుకు తీసుకున్న కొందరు రైతులతో ఎండోమెంట్ అధికారులు కుమ్మక్కై పాడుకున్న మొత్తాన్ని వసూలు చేయకపోవటం ఒక ఎత్తైతే.. అరకొర జమ అయిన నగదును లేనిపోని ఖర్చులు చూపి సిబ్బంది మింగటం అలవాటుగా మారింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు అభివృద్ధికి 2022 సంవత్సరంలో రూ.50 వేలు మాత్రమే అధికారులు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఇలా సంవత్సరానికి సరాసరి రూ.4లక్షల పైగా ఆదాయం వేసుకున్నా 15 సంవత్సరాలకు కలిపి రూ.60లక్షలు ఆదాయం ఏమైనట్లు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం లక్ష రూపాయలు మాత్రమే బ్యాంకు అకౌంట్‌లో ఉందని అధికారులు చెప్పటం గమనార్హం. గతంలోని ఓ అధికారి చెరువుకి లేని మెట్లు కూడా రిపేరు చేసినట్లు, చెరువు చుట్టూ చెట్లు పీకి మట్టి తోలినట్లు, చెరువులోని నాచు, జమ్ము, తొగించకుండానే తొలగించినట్లు రికార్డుల్లో నమోదుచేసి లక్షలాది రూపాయలను డ్రా చేసి సస్పెండ్ కావడం గమనార్హం. చేయని పనులకు లక్షల్లో బిల్లులు చేసుకోవడం ఎండోమెంట్ అధికారులకు పరిపాటిగా మారింది.

కలుషితమవుతున్న నీరు

15 సంవత్సరాల కాలంలో ఎంతోమంది అధికారులు మారినా చెరువును అభివృద్ధి చేసే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం చెరువు చుట్టూ చిల్ల చెట్లు మొలచి అధ్వానంగా మారింది. కట్టలపై వ్యర్థాలను పోయటంతో చెరువు చుట్టూ పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అలాగే చెరువు చుట్టూ కంచె లేకపోవటంతో పశువులు ఆ చెరువులోనే దిగుతున్నాయి. ముఖ్యంగా కొందరు ఆ చెరువును బహిర్భూమికి వినియోగిస్తున్నారు. చెరువులో నాచు, జమ్ము, తూటాకు పెరగడంతో నీరు రంగు మారింది. ప్రస్తుతం ఆ నీటినే గ్రామస్తులు వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

చెరువు ఎందుకు అభివృద్ధి చేయరు?



15 సంవత్సరాలుగా చెరువును అభివృద్ధి చేయకుండానే లక్షలాది రూపాయల మాన్యం భూముల ఆదాయాన్ని అధికారులు నొక్కేస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?

-బత్తుల సర్వేశ్వరరావు

ఒక్క రూపాయి ఇవ్వడం లేదు



చెరువు మరమ్మతులు చేయమని ఎన్నిసార్లు అడిగినా అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రతి ఏడాదీ చెరువుకు భూముల వేలం రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా చెరువు అభివృద్ధికి ఇంతవరకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు.

-ఈదల ప్రసాద్

నీరు దుర్వాసన వస్తోంది



చెరువు చుట్టూ వ్యర్థాలు వేయటంతోపాటు చెరువులో జమ్ము, నాచు పెరగటంతో నీరు కలుషితమై దుర్వాసన వస్తోంది. చెరువు చుట్టూ వ్యర్థాలు వేయటంతో పందులు కూడా అక్కడే సంచరిస్తున్నాయి.

-చుక్కపల్లి శ్రీనివాసరావు

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి



అంబేద్కర్ విగ్రహం కూడలిలో ఏర్పాటుచేసిన మానవహారం

- ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్
- బాపట్లలో భారీ ర్యాలీ

బాపట్ల: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను సమాజంలో పూర్తిగా నిర్మూలించినప్పుడే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమం గురువారం బాపట్లలో నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు, వివిధ శాఖల సమన్వయంతో బాపట్ల పట్టణంలో చేపట్టిన భారీ ర్యాలీని పార్లమెంట్ సభ్యులు కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కలిసి జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాలను వినియోగించరాదంటూ ర్యాలీలో పాల్గొన్న యువత ప్లకార్డులు చేతబూని పెద్ద పెట్టున నినదించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహం కూడలిలో మానవహారం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీ మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు చిన్నారులు, యువతనే లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నారని చెప్పారు. ఇలాంటి దుశ్చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ బాపట్లను నషా ముక్త్ జిల్లాగా నిలపడానికి అందరూ కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలు తయారీ, వినియోగం, రవాణా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఏడాది 80 శాతం మేర గంజాయి కేసులు తగ్గాయన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లాలో ఈగల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బుడా చైర్మన్ సలగాల రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

జిల్లా ఉద్యానశాఖాధికారి వెంకట్రావు

అమరావతి(అచ్చంపేట): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు 8 మండలాలను ఎంపిక చేసినట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. మండలంలోని మాల్లాదిలో గురువారం ఉద్యానశాఖ, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త సహకారంతో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ అమరావతి మండలంలోని మల్లాదిలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం జరిగిందన్నారు. రైతులకు ఒక హెక్టార్‌కి 150 మొక్కలు చొప్పున విదేశీ మొక్కలకు ఒక్కొక్క మొక్కకు రూ.193, దేశీయ మొక్కకు రూ.133 చొప్పున రూ.29,000 రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. సాగు ప్రోత్సాహంలో భాగంగా హెక్టారుకు 50శాతం రాయితీపై నాలుగు సంవత్సరాలకు రూ.21000లకు మించకుండా రాయితీ ఇవ్వనున్నామన్నారు. అమరావతి మండలం ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ లిమిటెడ్ ఏరియా మేనేజర్ యం.నవీన్ తెలిపారు.

మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చండి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ

బల్లికురవ: దూరంలో ఉన్న పాఠశాలలకు తమ బిడ్డలను పంపలేమని తమ పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని చిన అంబడిపూడి, కొణిదెన హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు.. గురువులను డీఈఓ, డిప్యూటీ ఈవోలకు గురువారం విన్నవించారు. ఇటీవల ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను బేసిక్, ఫౌండేషన్, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పుచేసింది. రెండు పాఠశాలల్లో ఫౌండేషన్‌తో 1,2 తరగతులను నిర్వహిస్తూ, 3,4,5 తరగతులను మరో పాఠశాలలకు విలీనం చేశారు. చిన అంబడిపూడి పాఠశాలను పెద అంబడిపూడి హెచ్‌సీ పాఠశాలకు, కొణిదెన హెచ్‌సీ పాఠశాలను హెచ్‌ఈ పాఠశాలలో కలపటంతో గ్రానైట్ లారీలు రాకపోకలు, ట్రాఫిక్ దృష్ట్యా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు వివరించారు. ఇటీవల మోడల్ పాఠశాలలుగా మార్చాలని కలెక్టర్ జె.వెంకట మురళి, డీఈవో ఎస్ ఎస్ పురుషోత్తం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రాలు అందజేశారు. డీఈవో రెండు పాఠశాలల తనిఖీ, విలీనం అయిన పాఠశాలలను పరిశీలించి ఎంఈవో 1, 2 వస్త్రం నాయక్, రమేష్‌బాబు, కాంప్లెక్స్ చైర్మన్‌లు జె.హనుమంతరావు, కేబీ వెంకటేశ్వరరావుతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు రెండు పాఠశాలలను, రికార్డులు తనిఖీ చేశారు. 1 నుంచి 5 తరగతుల్లో ఆధార్ డేటా ప్రకారం 45 పైగా విద్యార్థులు ఉండాలని అప్పుడే మోడల్ పాఠశాలగా మార్పు చేసేందుకు నివేదిస్తామని ప్రకటించారు.

ముంచెత్తే మత్తు.. బతుకే చిత్తు

కూటమి పాలనలో విచ్చలవిడిగా డ్రగ్స్ విక్రయాలు

కూటమి అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. యువత, కళాశాలల విద్యార్థులు, పాఠశాలల్లో చదువుకునే బాలలే లక్ష్యంగా మాదకద్రవ్యాల ముఠాలు చెలరేగిపోతున్నాయి. పాలకులకు రెడ్‌బుక్ పేరిట రాజకీయ కక్షలు సాధించడంతో సరిపోతోంది. దీంతో ప్రజలకు రక్షణ కొరవడుతోంది. మరోవైపు డ్రగ్స్ దెబ్బకు యవత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోంది.


- కళాశాలల యువతే లక్ష్యంగా అమ్మకాలు
- శివారు ప్రాంతాలలో జోరుగా సాగుతున్న దందా
- ఏడాదిలోనే 300 కేజీల గంజాయి స్వాధీనం
- కట్టడిలో పూర్తిగా విఫలమైన కూటమి సర్కార్



నెహ్రూనగర్ : రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాలో గంజాయి, కొకైన్, మెత్, ఎండీఎం వంటి మాదకద్రవ్యాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విశాఖపట్నం, పాడేరు, అరకు, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయి భారీగా సరఫరా అవుతోంది. ముఖ్యంగా యువతే లక్ష్యంగా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

విద్యార్థులే లక్ష్యంగా...

శివారు ప్రాంతాలలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అక్కడి నుంచి నగరంలోకి సిగరెట్స్, చాకెట్లు, చూయింగ్ గమ్, పౌడర్ రూపంలో తీసుకొస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని జోరుగా విక్రయాలు జరుపుతున్నారు. కేజీ గంజాయి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా గ్రాము చొప్పున క్రిస్టల్‌ను రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, మెత్‌ను రూ.5 వేలు నుంచి రూ.6 వేలు, ఎండీఎంఏను రూ.3 వేలు నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు ప్రాంతాల నుంచి గుంటూరు జిల్లాకు మాదకద్రవ్యాలు చేరుతున్నాయి.



రాజధాని ప్రాంతంలోనే ఎక్కువ



మంగళగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్క ఈ స్టేషన్ పరిధిలోనే గత సంవత్సరం ఆగస్టులో 231.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 234.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 38 మందిని అరెస్ట్ చేశారు. దీంతోపాటు మెత్, ఎండీఎంఏ 23 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మూడు కేసులు నమోదు చేయడంతోపాటు 17 మందిని అరెస్ట్ చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సుమారు వంద కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 20 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరో వైపు అధిక ధర పెట్టి మద్యం కొనుగోలు చేయలేక చాలా మంది పేదలు, రోజువారీ కూలీలు తక్కువ ధరకు లభించే శానిటైజర్‌ను మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి మత్తులో తేలుతున్నారు. ఆయా షాపుల్లో ఇలాంటివి విక్రయించడంపై నిబంధనలు కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది.

జగన్ ప్రజల వద్దకు వెళ్లకుండా కుతంత్రాలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల వద్దకు వెళ్లకుండా చేసేందుకే కూటమి ప్రభుత్వం కుతంత్రాలు పన్నుతోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న జనాదరణ చూడలేకే, ఆయన పర్యటలను అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుతంత్రాలు పన్నుతోందని విమర్శించారు. కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు అన్యాయం చేస్తుంటే.. తమ నాయకుడు వాటిని ప్రజలలోకి తీసుకెళ్లి ఎండగడుతున్నారన్నారు. అందుకే ఆయన్ను అడ్డుకోవాలనే దురుద్దేశంతో కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుట్రపూరిత వైఖరితో జగన్ బుల్లెట్ వాహనాన్ని ఏకపక్షంగా జప్తు చేయడం, సర్కారు పన్నాగమని.. కూటమి ఏడాది పాలన వైఫల్యాలను పక్కదోవ పట్టించే విధానంలో భాగమేనన్నారు. ఆయన వాహనాన్ని సుదీర్ఘకాలం జప్తులో ఉంచేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. సింగయ్య మృతి ఉదంతాన్ని వక్రీకరిస్తూ నమోదు చేసిన కేసుపై వైఎస్సార్ సీపీ న్యాయ పోరాటం చేస్తోందన్నారు. ప్రజల్లో జగన్‌కు ఉన్న జనాదరణే ఆయనకు మేలు చేస్తుందని తెలిపారు. ఆయన పర్యటనను ఎవరూ అడ్డుకోలేరని.. న్యాయం గెలుస్తుందన్నారు. ఇటీవల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భూస్థాపితం చేస్తానని ఓ ఇంటర్వ్యూలో చంద్రబాబు అన్న విషయాన్ని ఉటంకించారు. రాజకీయాలకతీతంగా జగన్‌కు సర్కారు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 40 ఏళ్ల సీనియర్ నాయకుడనని చెప్పుకునే చంద్రబాబుకు దిగజారుడు రాయకీయాలు తగవన్నారు.

క్లుప్తంగా

ఫెన్సింగ్‌లో సిల్వర్ మెడల్



సంతమాగులూరు (అద్దంకి రూరల్): వెల్లలచెరువు గ్రామానికి చెందిన జి.తన్మయ్‌శ్రీ ఏసీఎంఈ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం జరిగిన గుంటూరు డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్‌లో అండర్ 10 కేటగిరీలో ఫాయిల్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నెల 29న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు. తన్మయ్‌ని గుంటూరు జిల్లా సెక్రటరీ అశోక్‌బాబు, ఏపీఎంఈ స్కూల్ డైరెక్టర్ ఎస్. సౌగంధ కృష్ణ అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సంతమాగులూరు(అద్దంకి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సంతమాగులూరు మండలం ఏల్చూరులో బుధవారం రోడ్డు ప్రమాదం జరగగా.. రవితేజ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని గుంటూరు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ఆ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. చేతికి అందినవచ్చిన కుమారుడు మృతి చెందడంతో గ్రామంలో, కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

అద్దంకి: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొట్టిన ఘటన పట్టణంలోని రంగారావు వైద్యశాల సమీపంలో గురువారం జరిగింది. నెల్లూరు నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు తెల్లవారుజామున రెండు గంటల సమయంలో రంగారావు వైద్యశాలకు ఎదురుగా ఉన్న డివైడర్ ఇనుప గ్రిల్స్‌ను ఢీ కొట్టింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రయాణికులకు ఏమీ కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే బస్సు అదుపు తప్పి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ మధ్య ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పట్టణం నుంచి నామ్‌ర హదారి వెళ్తుండటంతో రహదారి రద్దీగా మారిందని, బైపాస్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ

మార్టూరు: దేశంలో ఐదు దశాబ్దాల క్రిందటి ఎమర్జెన్సీలో ప్రజలు, ఉద్యోగులు విద్యార్థులు, మేధావులు తదితర అన్ని రంగాలకు చెందిన వారు సంక్షోభాన్ని ఎదుర్కొంటే నేడు మోదీ పాలనలో అంతకంటే ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నామని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో గంగయ్య మాట్లాడారు. 1975 జూన్ 25వ తేదీన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి మేధావులు, ఉద్యోగులు, ప్రజల హక్కులు కాలరాశారన్నారు. కానీ ప్రస్తుతం మోదీ ప్రభుత్వంలో అప్రకటిత ఎమర్జెన్సీ విధించి.. అన్ని రంగాలను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, తదితర రాజ్యాంగ వ్యవస్థలను నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా తన గుప్పెట్లో పెట్టుకున్నారని తెలిపారు. దీనివలన రైతులు, కార్మికులు, ప్రజల హక్కులకు భంగం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండగా సంస్కరణల బాట పట్టించాల్సింది పోయి వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు పాదాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మతం ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వం అలంబిస్తున్న విధానాలను పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఏకతాటిపై నిలిచి ఎదురుకోవాలని లేకుంటే గత ఎమర్జెన్సీ పాలన మించిన గడ్డు పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బత్తుల హనుమంతరావు, విశ్రాంత ఉద్యోగులు ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె: మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మాదక ద్రవ్యాలతో కుటుంబాలు నాశనమవ్వటంతోపాటు సమాజం పెడద్రోవ పడుతోందన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలపై అవగాహన ఉండి వీటికి దూరంగా ఉండాలన్నారు. సమాజంలో తోటి వారికి వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల నుంచి రింగు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, సీఐలు సురేష్‌బాబు, మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, వివిధ కళాశాలల, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, విద్యార్థులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,400 గరిష్టం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,700

పసుపు ధరలు (గురువారం)



యార్డుకు వచ్చిన బస్తాలు : 596

కొమ్ములు : 361 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,650	11,000	10,450

కాయలు : 235 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,650	10,500	10,400

మొత్తం అమ్మకాలు : 447 క్వింటాళ్లు

-దుగ్గిరాల

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మీరా



గుంటూరుమెడికల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగుల్‌మీరా ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగాయి. సభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి రాంబాబు, గుంటూరు నగర అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, కార్యదర్శి కె.ఫణీంద్ర తదితరులు మీరాకు అభినందనలు తెలిపారు.

చిన్నారులు పోటీతత్వాన్ని పెంచుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు క్రీడా సాధన ద్వారా పోటీతత్వాన్ని అలవరచుకోవాలని ఏసీఎంఈ స్కూల్ డైరెక్టర్ నందమూరి సౌగంధ కృష్ణ తెలిపారు. గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు రూరల్ మండలం పొత్తూరులోని ఏసీఎంఈ స్కూల్ ప్రాంగణంలో జరిగిన అండర్-10, 12 బాలబాలికల జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శారీరక పటుత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడలో సాధన చేయాలని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 29వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సౌగంధ కృష్ణ, అశోక్ బాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డీఎస్ క్రిస్టోఫర్, పీఈటీ రాజేష్ ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సౌగంధ కృష్ణ

విజేతలు వీరే...

- అండర్ 12 బాలుర విభాగంలో.. సాబర్ విభాగం : చైతన్య కృష్ణ, పృథ్వీ వినయ్, ఫాయిల్ విభాగం: ఇ.కౌశిక్.
బాలికల విభాగంలో.... సాబర్ విభాగం: ఆరోహి, హన్సిక, ఎప్పి విభాగం: జోష్మిక, లక్ష్మీ కార్తిక, ఫాయిల్ విభాగం: శ్లోక, హస్నా.
- అండర్-10 బాలుర విభాగంలో... ఫాయిల్ విభాగం: రిశాంక్, సంజయ్, ఎప్పి విభాగం: హర్షవర్ధన్. బాలికల విభాగంలో.. ఎప్పి విభాగం: దీక్షిత, తన్మయి శ్రీ.

మిర్చి యార్డు సమాచారం (గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,633
అమ్మకాలు	43,848
నిల్వ	10,563

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,300
341	రూ. 10,000 - 13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,500
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,800
ఆర్మూర్	రూ. 9,800 - 11,000
తాలుకాయలు	రూ. 5,000 - 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,400
341	రూ. 10,000 - 13,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,600
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
తాలుకాయలు	రూ. 5,500 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

'దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, నాయకులు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన 'దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన' అనే పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత గ్యాస్ నగదు పడక ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. తల్లికి వందనం మొదటి సంవత్సరం డబ్బులు వేయకుండా రెండవ సంవత్సరం వేశారని, అయినా కరెంటు బిల్లులు, కార్లు అని అనేక మందికి నగదు వేయలేదన్నారు. అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో వారికి కూడా నగదు వేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లు పెడితే పగలగొట్టమని నారా లోకేష్ పిలుపునిచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి మోడల్ స్కూల్ పేరుతో 3,4,5 తరగతులను విడదీసి దూరంగా ఉన్న హైస్కూళ్లకు విలీనం చేయడంతో ఉన్న స్కూల్లో పిల్లల సంఖ్య తగ్గిపోయిందని, ఆ స్కూల్‌ను కూడా మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ధరణికోట విమల, పెండ్యాల మహేష్, గుంటూరు మల్లేశ్వరి, గుంటుపల్లి బాలకృష్ణ, నాయకులు ఎం.హరిపోతురాజు, గుంటుపల్లి రజని, స్పందన, జడ రాజకుమార్, షేక్ మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు క్రీడలతో ఉపశమనం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వృత్తిపరంగా పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు వైద్యులు నిత్యం క్రీడా సాధన చేయాలని డాక్టర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (డీఎస్‌సీవో) కార్యదర్శి డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక గుంటూరు మెడికల్ అసోసియేషన్ భవన సముదాయంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని ఒత్తిడిని అధిగమించడంతోపాటు ఆటవిడుపు కోసం ప్రతి ఏడాది వైద్యుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు భాగంగా క్యారమ్స్‌తోపాటు క్రికెట్, చెస్, కల్చరల్ విభాగాల్లో పోటీలు కొనసాగుతాయని చెప్పారు. సుమారు 50 మంది పేరొందిన వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో డీఎస్‌సీవో అధ్యక్షుడు డాక్టర్ టి.సి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్యారమ్స్ పోటీలకు ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ రిఫరీగా వ్యవహరించారు.



క్యారమ్స్ పోటీల్లో తలపడుతున్న వైద్యులు

వివాహితతో అసభ్య ప్రవర్తన

- పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం
- ముగ్గురుపై కేసు నమోదు

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరులో యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ముగ్గురిపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం అత్తలూరు బీసీ కాలనీకి చెందిన వివాహితతో అదే కాలనీకి చెందిన టి.యోగేంద్ర, బి.అంకమ్మరాజు, బి.పోతురాజులు అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో ఆమె భర్త రావటంతో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై తీవ్ర మనస్తాపం చెందిన వివాహిత పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి గురువారం అదుపులోకి తీసుకున్నామని సీఐ అచ్చియ్య తెలిపారు.

అప్రకటిత ఎమర్జెన్సీ కోరల్లో ప్రజాస్వామ్యం

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మచిలీపట్నంటౌన్: దేశంలో 50 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన నియంతృత్వ పోకడల కారణంగా ఎమర్జెన్సీ విధిస్తే నేడు దేశంలో ప్రధాని మోదీ నియంతృత్వ పోకడలతో అప్రకటిత ఎమర్జెన్సీ రూపంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. బుట్టాయిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞానకేంద్రంలో గురువారం 'ఎమర్జెన్సీ నాడు-నేడు'పై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. నాడు ఇందిరాగాంధీ తనకు ఎదురులేదని నిరూపించుకోవడానికి ఎమర్జెన్సీ విధిస్తే, నేడు దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల్లో హిందువులు, ముస్లింలు ప్రాతిపదికన విభజన తీసుకురావడానికి నిరంకుశ విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించి ప్రజలను చైతన్య పరుస్తున్న గౌరీ లంకేష్, నరేంద్ర దంబులకర్ గోవింద పనసరే తదితరులను ఆర్‌ఎస్‌ఎస్ ముష్కరులు చంపేశారని ఆందోళన వ్యక్తంచేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రొఫెసర్ సాయిబాబాకు కోర్టులో బెయిల్ ఇచ్చినా కేంద్ర రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా సుప్రీంకోర్టు న్యాయమూర్తులను అత్యవసరంగా సమావేశ పరిచి బెయిల్ రద్దు చేయించి ఆయన జైలులో మగ్గిపోయేలా చేశారన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యాంగ సవరణలకు పాల్పడుతోందన్నారు.



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపో ఆవరణలోని డ్రైవర్ల శిక్షణ స్కూల్‌లో 20వ బ్యాచ్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు గురువారం కోరారు. ఇప్పటివరకు 19 బ్యాచ్‌ల శిక్షణ విజయవంతంగా పూర్తయిందన్నారు. వచ్చేవారంలో 20వ బ్యాచ్ ప్రారంభం కానుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అభ్యర్థులు తప్పనిసరిగా ఒక ఏడాది క్రితమే లైట్ వెయిట్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు రూ.23వేలుగా నిర్ణయించామని, ఆసక్తిగల అభ్యర్థులు 99592 25428 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.